# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 211 | పేజీలు: 4 | వెల: రూ.3/- | శుక్రవారం 8 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




### ఉద్యోగ నియామకాల
## ఎంపిక ప్రక్రియ
### మధ్యలో నిబంధనలు మార్చరాదు
### సుప్రీంకోర్టు కీలక తీర్పు

2లో..




# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే

**యోగా చేసి ట్రిమ్ముగా తయారై వస్తా**
**నీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు**
**ఈ రేసింగ్‌తో హైదరాబాద్ ఇమేజ్ పెంచా**
**మెఘా కంపెనీపై కేసు పెట్టే దమ్ముందా**
**మీడియా సమావేశంలో కేటీఆర్ హాట్ కామెంట్స్**

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): జైలుకు వెళ్లేందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదని బిఆర్ఎస్ నేత కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నా మీద ఎందుకు కేసులు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిలదీశారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.ఫార్ములా–ఈ రేస్ విషయంలో మీడియాకు చెప్పిందే.. అక్కడ చెబుతా. గవర్నమెంట్‌గా నిర్ణయం తీసుకున్నానని చెబుతాను. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధి దృష్ట్యా నిర్ణయం తీసుకున్నాను. నా మీద కేసులు ఎందుకు పెడుతావ్.. హైదరాబాద్ ఇమేజ్ పెంచినందుకా..? లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చినందుకా..? ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలబెట్టినందుకా..? బెంగళూరును దాటి హైదరాబాద్‌లో ఐటీ ఎగుమతులు పెంచినందుకా..? పారిపోతాయన్న కంపెనీలను కాపాడినందుకా..? దిగ్గజ కంపెనీలకు డ్రీమ్ డెస్టినేషన్‌గా మార్చినందుకా..? కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసినందుకా..? అని సూటిగా ప్రశ్నించారు. అటెన్షన్ డైవర్షన్ గేమ్‌లతో రేవంత్ రెడ్డి ఎక్కువ రోజులు తప్పించుకోలేడు. నువ్వు ఎన్ని వేషాలు వేసినా.. మేం నిన్ను విడిచిపెట్టం. ఆరు గ్యారెంటీలను వదిలిపెట్టం. అప్పుడప్పుడు నువ్వు గోకినట్టు చేస్తే మేం కూడా వివరణ ఇస్తాం ఎందుకంటే ప్రజలకు వాస్తవాలు తెలియాలి. ఇన్ని చెప్పినా కూడా కేసు పెడుతాం అంటే నీ ఇష్టమున్న కేసు పెట్టుకో అని రేవంత్ రెడ్డికి కేటీఆర్ తేల్చిచెప్పారు. కేటీఆర్ టార్గెట్ అని పేపర్లలో రాస్తున్నారు. ఆరు గ్యారెంటీల అమలు, వడ్ల కొనుగోలు, రైతుబంధు, దళితబంధు, స్కూటీలు ఇచ్చుడు, తులం బంగారం ఇచ్చుడు, గురుకులాలు బాగు చేసే

..మిగతా 2లో

### భుజాలు తడుముకుంటున్న
# కేటీఆర్

**అరాచకాలు బయటపడుతుంటే భయం పట్టుకుంది**
**చట్టం తనపని తాను చేసుకు పోతుంది**
**రైతులకు, నిరుద్యోగులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుంటాం**
**తొర్రూరు మార్కెట్ కమిటీ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి**



మహబూబాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): 'గుమ్మడి కాయల దొంగ అంటే.. భుజాలు ఎందుకు తడుముకుంటున్నవ్ కేటీఆర్..?' అని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రశ్నించారు. కేటీఆర్.. నువ్వు చేసిన తప్పేంటో నీకు తెలుసు.. పడబోయే శిక్ష ఏంటో నీకు తెలుసు' అని అన్నారు. 11 నెలలుగా బీఆర్ఎస్ ప్రభుత్వ అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని అన్నారు. గురువారం తొర్రూర్ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార సభలో ఆయన మాట్లాడుతూ.. 'తల తాకట్టు పెట్టయిన డిసెంబర్ లోపు 13 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని అన్నారు. 'రుణమాఫీ అయ్యాక నీ తల ఏ టైర్ కింద పెడతావో ఆలోచించుకో' అని అన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరే సమయంలో కేసీఆర్‌ను తండ్రిలా భావించి కాళ్లు మొక్కానని అన్నారు. కానీ తడిగుడ్డతో గొంతు కోశారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నాలుగు గోడల మధ్య కాళ్లు పట్టుకొనే అవసరం లేదని అన్నారు. ఎర్రబెల్లి దయాకర్ రావు 'పొంగులేటి హోం మంత్రా..? అలా ఎందుకు మాట్లాడుతున్నారు' అని అంటున్నారని, తాను క్యాబినెట్ మంత్రినని, అన్ని విషయాలూ మాట్లాడుతానని అన్నారు. కేటీఆర్ పాదయాత్ర చేస్తానని అంటున్నారని, పాదయాత్ర చేస్తారో.. మోకాళ్ల యాత్ర చేస్తాడో నిర్ణయం ఆయనే తీసుకోవాలని

..మిగతా 2లో

# నేడు యాదాద్రికి సీఎం రేవంత్

**పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక పూజలు**
**యాదాద్రి అభివృద్ధిపై అధికారులతో సమీక్ష**
**వలిగొండ వద్ద మూసీపునరుజ్జీవ యాత్ర ప్రారంభం**



హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తన పుట్టిన రోజును శుక్రవారం జరుపు కోనున్నారు. ఈ సందర్భంగా ఉదయం 8 గంటలకు ఆయన తన కుటుంబ సమేతంగా యాదాద్రికి వెళ్లనున్నారు. ఉదయం 8:45 గంటలకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఉదయం

..మిగతా 2లో



# కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నం

**విద్యార్థుల జీవితాలతో సీఎం రేవంత్ చెలగాటం : కేటీఆర్**

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నంలో విద్యార్థుల ప్రాణాలతో రేవంత్ సర్కార్ చెలగాటమాడుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కేసీఆర్‌పై కక్షగట్టి గురుకుల, ఆశ్రమ పాఠశాల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమా అని ప్రశ్నించారు. వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు చోటు చేసుకుంటున్నా సర్కార్ ఏం చేస్తున్నదని నిలదీశారు. విద్యార్థుల అవస్థలు రేవంత్ రెడ్డి

..మిగతా 2లో

## రేవంత్ మూసీ పాదయాత్రపై
# కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): మూసీ ప్రక్షాళన చేయాల్సిందేనని.. నల్గొండ రైతులకు శుద్ధి నీళ్ళు ఇవ్వాల్సిందేనని కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు.అందుకు బీజేపీ కార్యకర్తలు కరసేవ చేసేందుకు సైతం సిద్ధమని ప్రకటించారు. అయితే హైదరాబాదులో ఏ ఒక్క ఇల్లు కూలగొట్టిన సహించేది లేదని.. ఊరుకోబోమని ఆయన స్పష్టం చేశారు.మూసీ శుద్ధి చేసేందుకు రేవంత్ సర్కారుకు కిషన్ రెడ్డి పలు సూచనలు చేశారు. మొదట ప్రస్తుత మూసీకి రీటైనింగ్ వాల్ నిర్మాణం చేయాలని చెప్పారు. తర్వాత సిటీలోని డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసి శుద్ధినీరు మాత్రమే మూసీలోకి వదిలేలా చేయాలని సూచనలు చేశారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇళ్ళ కూల్చివేతకు వ్యతిరేకంగా మూసీ నిద్ర చేస్తామంటూ ఆయన సంచలన ప్రకటన చేశారు. ఒక రోజంతా

..మిగతా 2లో



# తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ




హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): తెలంగాణలో పలువురు డీఎస్పీ అధికారులు బదిలీ అయ్యారు. ఈ మేరకు డీజీపీ ఇవాళ (గురువారం) ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న అధికారి ఎస్ఆర్ దామోదర్ రెడ్డిని అంబర్‌పేట్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ప్రస్తుతం జగిత్యాల డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న జీ మహేశ్ బాబుని కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా బదిలీ చేశారు. ఇక కరీంనగర్ డీఎస్పీ, పీటీసీగా ఉన్న బీ.రామానుజంను కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. కాగజ్‌నగర్ ఎస్‌డీపీవోగా ఉన్న ఏ.కరుణాకర్‌ను అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. అసిఫాబాద్ ఎస్‌డీపీవోగా ఉన్న పీ.సదయ్యను బదిలీపై హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని డీజీపీ కోరారు. ప్రస్తుతం వనపర్తి డీఎస్పీ,

..మిగతా 2లో



# కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

**చిత్తశుద్ధితో కృషి చేయాలని అధికారులకు సీఎస్ ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతంగా పూర్తి చేసేందుకు చిత్త శుద్దితో కృషిచేయాలని అధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశించారు. రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణపై గురువారం ప్రత్యేకాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సీఎస్ సమీక్షించారు. ప్రణాళికా శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ సుల్తానియా కూడా పాల్గొన్న ఈ టెలీ కాన్ఫరెన్స్‌లో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ.. ఈ సర్వేకు సంబంధించి ఇంటింటి వివరాలను సేకరించి స్టిక్కరింగ్ చేసే పక్రియ రేపటితో

..మిగతా 2లో

# జైలుకు వెళ్లడానికి నేను సిద్ధమే

మొదటి పేజీ తరువాయి...

విషయంలో టార్గెట్ ఉండాలి.. టార్గెట్ కేటీఆర్ కాదు. వేస్తే వేసుకో.. నాకేం ఫరక్ పడేది లేదు. ఓ రెండు, మూడు నెలలు జైల్లో పెట్టి పైశాచిక ఆనందం పొందుతా అంటే నాకేం అభ్యంతరం లేదు. మంచిగా పోతా.. యోగా గిగా చేసుకోని ట్రిమ్‌గా వస్తా.. పాదయాత్ర ఎక్కుతా. నేను భయపడేటోని కాదు. ఈ ఉడుత ఊపులకు భయపడను. గాసిప్స్ పక్కకు పెట్టి.. గవర్నమెంట్ మీద దృష్టి పెట్టాలని రేవంత్ రెడ్డికి కేటీఆర్ సూచించారు. ఇకపోతే మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదకు ఏసీబీని పంపే దమ్ముందా..? అని సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు. నీవు మొగోనివే అయితే మెగా కృష్ణారెడ్డి కంపెనీని బ్లాక్ లిస్ట్‌లో పెట్టి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. నన్ను ఏసీబీ విచారిస్తుందట.. ఏసీబీ ఫుల్ ఫామ్ తెలుసా రేవంత్ రెడ్డికి.. తెలుసనుకో.. బ్యాగులతో తిరిగినోడికి ఎందుకు తెల్వదు. ఏసీబీ అంటే యాంటీ కరప్షన్ బ్యూరో. ఏసీబీని కరప్షన్‌కు వ్యతిరేకంగా వాడాలి. ఇందులో కరప్షన్ ఏడుంది.. కాకరకాయ ఏడుంది. నేను అడుగుతున్నా చెప్పు. ఫార్ములా-ఈ రేస్ హైదరాబాద్‌లో ఉండాలని చెప్పి హెచ్‌ఎండీఏ నుంచి రూ. 55 కోట్లు పంపిన మాట వాస్తవం. దాంట్ల నేను ఏమైనా దాచుకుంటినా..? నాకు ఏమైనా వచ్చాయ..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ రేస్ రద్దుతో హైదరాబాద్‌కు నష్టం కలిగించినా రేవంత్ రెడ్డి



మీద కేసు పెట్టాలి. హైదరాబాద్ ఇమేజ్ దెబ్బ తీశావు. రేవంత్ రెడ్డిది తెలివితక్కువ నిర్ణయం. ఆగస్టు 25న నరికిండు రేవంత్ రెడ్డి.. 2036 ఒలిపింక్స్‌ను ఇక్కడికి తెస్తడట. ఎంత ఖర్చు అయితదో తెలుసా ఈ సీఎంకు. 2016 ఒలిపింక్స్‌కు రియోలో లక్షా 8 వేల కోట్లు, 2020లో టోక్యోలో 2.9 లక్షల కోట్లు ఖర్చు పెట్టారు. ఈ ఖర్చు మన బడ్జెట్ అంత. ఈ మొగోడు ఒలింపిక్స్ హైదరాబాద్‌లో పెడుతాడట. 50 కోట్లకే ఒర్రుతుండు. నీ ముఖానికి అయితదా..? అంతర్జాతీయ ప్రమాణాతో ఈవెంట్ నిర్వహించడం తెలుసా..? అని కేటీఆర్ నిప్పులు చెరిగారు. చేతనైతే మెగా ఇంజినీరింగ్ మీద పెట్టు కేసు. సుంకిశాలలో గోడ కూలిపోయింది 80 కోట్లు నష్టం వచ్చింది. దమ్ముంటే బ్లాక్ లిస్ట్‌లో పెట్టి మెగా కృష్ణారెడ్డి ఇంటి మీదికి ఏసీబీని పంపు.. ఈస్టిండియా కంపెనీ అన్నావు కదా..? నీవు మొగోనివి అయితే పంపు.. ఏసీబీ కేసు పెట్టు. అవసరమైతే 50 లక్షలతో దొరికిన బ్యాగ్‌మెన్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. ఇవాళ రేస్ రద్దు చేయడం కారణంగా జరిగిన నష్టానికి రేవంత్ మీద ఏసీబీ కేసు పెట్టాలి. మేం బ్రాండ్ ఇమేజ్ క్రియేట్ చేశాం. మీరు బ్యాడ్ ఇమేజె క్రియేట్ చేస్తున్నాం. హైడ్రా పేరుతో విశ్వనగరం విజన్‌ను దెబ్బతీస్తున్నావ్ అని రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మండిపడ్డారు.



## ఉద్యోగ నియామకాల ఎంపిక ప్రక్రియ

### మధ్యలో నిబంధనలు మార్చరాదు... సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ, నవంబర్ 7 (ప్రభాత ఉదయం): సుప్రీంకోర్టు గురువారం కీలక నిర్ణయం తీసుకుంది. ఉద్యోగ నియామకాలకు సంబంధించి ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో నియామకాలకు సంబంధించిన నిబంధనలను మార్చలేమని కోర్టు పేర్కొంది. పోస్టుల ఎంపిక పక్రియ ప్రారంభమైన తర్వాత నియమాలను మధ్యలో మార్చలేమని సుప్రీం కోర్టు రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ఈ కేసు రాజస్థాన్ హైకోర్టులో ఓ ప్రభుత్వ పోస్టు రిక్రూట్‌మెంట్‌కు సంబంధించినది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు తీర్పుల చెప్పింది. సీజేఐ చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ నిర్ణయం తీసుకుంది. జస్టిస్ హ్రిషికేశ్ రాయ్, జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ మనోజ్ మిశ్రా బెంచ్ ఈ తీర్పును వెలువరించింది. 2008లో కె.మంజుశ్రీ వర్సెస్ ఆంధ్రప్రదేశ్ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును బెంచి సమర్థించింది. ఆ కేసు తీర్పు సరైనదని.. దానిని తప్పు అని చెప్పడానికి అవకాశం లేదని పేర్కొంది. 'ప్రభుత్వాలు నియామక పక్రియకు ముందే నిబంధనలు సిద్ధం చేసి ఆ తర్వాతే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించాలి. చివరికి ఖాళీలను పూరించిన తర్వాత ఆ పక్రియ ముగుస్తుంది. నిబంధనలు మార్చొచ్చని ముందుగానే చెబితే పర్వాలేదు. నియామక పక్రియ నిబంధనలు ఎవరికి నచ్చినట్లు వారు మార్చడానికి వీల్లేదు. కచ్చితంగా రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు అనుగుణంగా ఉండాల్సిందే. ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉండాలి. మధ్యలో నిబంధనలు మార్చి అభ్యర్థులను ఇబ్బందిపెట్టరాదు.' అని ధర్మాసనం పేర్కొంది.

## కుటుంబ సర్వేను విజయవంతం చేయండి

మొదటి పేజీ తరువాయి...

పూర్తవుతుందని, ఈ నెల 9 నుండి అసలు సర్వే మొదలవుతుందన్నారు. ఉమ్మడి జిల్లాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సర్వే జరుగుతున్న విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించడంతో పాటు జిల్లా కలెక్టర్లు, సర్వే నోడల్ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. సేకరించిన వివరాలను కంప్యూటరైజ్ చేయడానికి సుశిక్షితులైన డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దేశంలోనే ప్రథమంగా చేపట్టిన ఈ ఇంటింటి కుటుంబ సర్వే పక్రియని రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యవేక్షిస్తున్నారని వెల్లడించారు. ఈ సర్వేలో ప్రతీ ఒక్క కుటుంబం పాల్గొనేలా ప్రతీ రోజూ ప్రజలను చైతన్యపర్చేలా విస్తృత ప్రచారం చేపట్టాలని తెలిపారు. ఏ ఇంటిని కూడా వదలకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

## తెలంగాణలో పలువురు డీఎస్పీల బదిలీ

మొదటి పేజీ తరువాయి...

డీసీఆర్‌బీగా ఉన్న కే.క్రిష్ణ కిశోర్‌ను తొర్రూర్ (మహబుబాబాద్) ఎస్‌డీపీవోగా బదిలీ చేశారు. ఇక తొర్రూర్ ఎస్‌డీపీవోగా ఉన్న వీ సురేశ్‌ను హైదరాబాద్‌లోని చీఫ్ ఆఫీస్‌లో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. నిర్మల్ డీఎస్పీ, డీసీఆర్‌బీగా ఉన్న పీ.రవీందర్ రెడ్డిని ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా బదిలీ చేశారు. ఖమ్మం ఏసీపీ, సీసీఆర్‌బీగా ఉన్న డీ.ప్రసన్న కుమార్‌ను మెదక్ ఎస్‌డీపీవోగా ట్రాన్స్‌ఫర్ చేశారు. ఈ మేరకు సంబంధిత అధికారులకు డీజీపీ ఉత్వర్వులు జారీ చేశారు. కొత్త పోస్టింగ్ ప్రదేశాల్లో తక్షణమే రిపోర్ట్ చేయాలని స్పష్టం చేశారు.



## భుజాలు తడుముకుంటున్న కేటీఆర్

మొదటి పేజీ తరువాయి...

పొంగులేటి ఎద్దేవా చేశారు. తాను ఆ పార్టీ, ఈ పార్టీ నేతలను అరెస్టు చేస్తారని ఎక్కడా చెప్పలేదని తెలిపారు. దానికి శ్రీనివాస్ రెడ్డి అదాని కాళ్లు మొక్కాడని ప్రచారం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. తనకు చట్టం తెలుసునని, ఎప్పుడు, ఎక్కడ ఏం జరగాలో అది జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ హాట్ కామెంట్స్ చేశారు. రాష్ట్ర ప్రజలు మార్పు కావాలని ఇందిరమ్మ రాజ్యం తీసుకొచ్చారని అన్నారు. గత ప్రభుత్వం 7 లక్షల 19 కోట్ల రూపాయలు అప్పు చేసి ఇప్పుడు విమర్శలు చేస్తున్నారు.. ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం మీద బావ బావమరిది తప్పుడు ప్రచారు చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రత్యక్షంగా రైతుల కోసం ఇప్పటి వరకు రూ. 18 వేల కోట్లు రుణమాఫీ చేశాం.. మిగతా 12 వేల కోట్ల రుణమాఫీ చేస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు. బావ బావమరిది తల ఎక్కడ పుట్టుకుంట్టారో అప్పుడు చెప్పుతామని అన్నారు. పేదల పక్షపాతి ప్రభుత్వం కాబట్టి రైతుబంధు కొంచెం ఆలస్యమవుతుందని మంత్రి అన్నారు. తాము ఇచ్చే స్మార్ట్ కార్డు ప్రభుత్వం ఇచ్చే ప్రతి పథకానికి అని తెలిపారు. ఇందిరమ్మ ప్రభుత్వం వచ్చిన తర్వాత ధరణిలో విదేశాల సంస్థలకు ఇచ్చిన భూమిని మళ్ళీ తీసుకొస్తున్నాం.. దేశంలో ఎక్కడ లేనటువంటి కొత్త రెవెన్యూ చట్టాన్ని తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. తప్పు చేస్తే పేదవాడి సొమ్మును కొల్లగొడితే పేదవాడికి కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. గుమ్మడికాయ దొంగ అంటే కేటీఆర్ ఎందుకు భయపడుతున్నావో చెప్పాలన్నారు. నీవు ఎందుకు పాదయాత్ర చేస్తున్నావో ప్రజలకు చెప్పాలని తెలిపారు. మనిషిని మనిషిలా గౌరవించని మీరు.. పదవిపోయే సరికి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని దుయ్యబట్టారు. చట్టానికి తెలుసు.. ఎప్పుడు, ఎక్కడ ఏమి జరగాలో తెలుసు.. త్వరలో చట్టం తన పని తాను చేసుకుంటూ పోతుందని మంత్రి పొంగులేటి తెలిపారు. రైతులకిచ్చిన మాటని తుచ తప్పకుండా చేస్తామన్నారు. రైతన్నలకి, నిరుద్యోగులకు ఈ ప్రభుత్వం చిత్త శుద్ధితో పని చేస్తుందని అన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల వరకు కొత్త పింఛన్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు అన్ని పథకాలు ఇచ్చి తీరుతామని మంత్రి పొంగులేటి తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీ రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ చార్జి అనుమాండ్ల ఝాన్సీరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతి రెడ్డి అలాగే ప్రభుత్వా విప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్, ఎంపీలు, బలరాం నాయక్, కడియం కావ్య పాల్గొన్నారు.

## రేవంత్ మూసీ పాదయాత్రపై కిషన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి...

మూసీ పరివాహక బాధితుల ఇంట్లో అక్కడే ఉంటూ.. అక్కడే తింటాం అక్కడే పడుకుంటామంటూ ఆయన చెప్పారు. కృష్ణ గోదావరి నీళ్లను తీసుకొచ్చి మూసీలో కలిపిన అభ్యంతరం లేదని కార్పొరేట్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తామంటే మాత్రం చూస్తూ ఊరుకోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఇళ్లను కూలగొట్టకుండా మురికి మూసీ శుద్ధి చేసే ప్రయత్నాలు చేయాలంటూ ప్రభుత్వానికి సూచించారు. తాజాగా ప్రభుత్వం చేపట్టిన కులగణనపై కూడా కిషన్ రెడ్డి మాట్లాడారు. కులగణనకు బీజేపీ వ్యతిరేకం కాదని.. 42% రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో అమలు చేయాలంటూ ఆయన డిమాండ్ చేశారు.తన డీఎన్‌ఏపై మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలకు ఆయన స్పందించారు. తెలంగాణ ప్రజలకు తన డీఎన్‌ఏ ఏంటో తెలుసు అని.. ఎవరి సర్టిఫికెట్ అవసరం లేదంటూ ఘాటుగా రిప్లై ఇచ్చారు. ఇక రానున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి త్వరలోనే అభ్యర్థులను ప్రకటిస్తామని పార్టీ గెలిపే లక్ష్యంగా అభ్యర్థుల ఎన్నిక ఉండబోతుందంటూ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎల్లుండి బీజేపీ బృందాలు సందర్శిస్తాయని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండిటిని ఖతం చేసి తెలంగాణలో త్వరలోనే బీజేపీ పాగ వేయబోతున్నట్టు చెప్పుకొచ్చారు.

## నేడు యాదాద్రికి సీఎం రేవంత్

మొదటి పేజీ తరువాయి...

10 గంటలకు యాదాద్రి అధికారులతో ఆలయ అభివృద్ధిపై సీఎం సమీక్ష నిర్వహించనున్నారు. అనంతరం మూసి పునరుజ్జీవ ప్రజా చైతన్య పాదయాత్ర ప్రారంభించనున్నారు. మధ్యాహ్నం 1 గంటకు వలిగొండ మండలం సంగెం నుంచి సీఎం రేవంత్ రెడ్డి ప్రజా చైతన్య పాదయాత్ర చేపడుతారు. మూసీ పరివాహక ప్రాంతంలో 6కిలోమీటర్లు పాదయాత్ర చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగానే భీమలింగం, ధర్మారెడ్డి కాల్వలను సందర్శించనున్నారు. అనంతరం మూసి పరివాహక ప్రాంత రైతులతో సమావేశం కానున్నారు. రైతుల యోగా క్షేమాలు అడిగి తెలుసుకోనున్నారు. రైతులతో సమావేశం అనంతరం తిరిగి హైదరాబాద్ చేరుకోనున్నారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లను ఎంపీ చామల కిరణ్ కుమార్, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు.

## లేడీ టీచర్ స్కెచ్‌కు అడ్డంగా బుక్కైన డీఈఓ



మహబూబ్ నగర్, నవంబర్ 7(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ ఇంచార్జ్ డీఈఓ రవీందర్ ఏసీబీకి చిక్కడం రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాలలో చర్చనీయాంశం అయ్యింది. ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పదోన్నతుల సందర్భంగా ఒక ఉపాధ్యాయురాలుకు దక్కవలసిన ప్రమోషన్ మరో ఉపాధ్యాయురాలకు దక్కింది. దీంతో ప్రమోషన్ పొందని ఉపాధ్యాయురాలు ఒకే రిజర్వేషన్ ఉండి తనకన్న జూనియర్‌కు ప్రమోషన్ ఎలా వచ్చిందన్న అంశంపై పూర్తి వివరాలను సేకరించి.. ఈ విషయాన్ని డీఈఓ రవీందర్ దృష్టికి తీసుకువెళ్ళింది. తాను ఇప్పుడు ఏమి చేయలేనని కోర్టుకు వెళ్లి పర్మిషన్ తెచ్చుకోవాలని సూచించారు. ఆమె కోర్టు నుంచి అనుమతిని తెచ్చుకోవడంతో ప్రమోషన్ ఇవ్వడానికి రెండు లక్షల రూపాయలు డిమాండ్ చేశారు. చివరకు లక్షన్నర రూపాయలు తీసుకొని ప్రమోషన్ ఇచ్చారు. ప్రమోషన్ ఇచ్చిన అనంతరం సీనియారిటీ విషయంలో తనకన్నా జూనియర్ తర్వాతే ఉండడం వల్ల భవిష్యత్తులో తనకు మళ్లీ నష్టం జరిగే ప్రమాదం ఉందని, తన సీనియారిటీని సరి చేయాలని డీఈఓకు తన భర్తతో కలిసి వెళ్లి విజ్ఞప్తి చేసింది. మళ్లీ కోర్టు నుంచి అనుమతి తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు. ఆమె మళ్లీ కోర్టును ఆశ్రయించడంతో సీనియారిటీ సరిచేయాలని న్యాయస్థానం ఆదేశించింది. కానీ కోర్టు ఆదేశాలను డీఈఓ అమలు చేయకుండా మరో లక్ష రూపాయలు డిమాండ్ చేశారు. చివరకు రూ.50 వేలకు అంగీకరించాడు. న్యాయంగా తనకు రావలసిన ప్రమోషన్ రాకుండా, జూనియర్‌కు ఇవ్వడమే కాకుండా, న్యాయస్థానం నుంచి వచ్చిన ఉత్తర్వులను అమలు చేయకుండా లంచం డిమాండ్ చేయడంతో ఆ ఉపాధ్యాయురాలు తన భర్తతో కలిసి ఏసీబీని ఆశ్రయించింది. దీనితో తాము రంగంలోకి దిగి లంచం తీసుకుంటున్న డీఈవోను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ కృష్ణ గౌడ్ తెలిపారు.



## ధర్మగిరి దేవాలయంలో కార్తీక గురువారం అన్నదానం

శంషాబాద్,నవంబర్ 7( ప్రభాత ఉదయం) శంషాబాద్ పట్టణంలోని శ్రీ ధర్మ సాయి మందిరంలొ గురువారం అన్నదాన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహిస్తున్నారు. హిందువులు అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసంలో వచ్చిన మొదటి గురువారం కావడంతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షురాలు ధరణి మాత. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు శివ సాయి దత్తు ఆధ్వర్యంలో గురువారం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ప్రతిరోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కార్తీక మాసం కావడంతో ఈ మాసంలో వచ్చిన మొదటి గురువారం కావడం మూలంగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శంషాబాద్. మామిడిపల్లి. జల్పల్లి. కాటేదాన్. తదితర గ్రామాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కేసీఆర్ ఆనవాళ్లను చెరిపేసే ప్రయత్నం

మొదటి పేజీ తరువాయి...

కంటికి కనిపించడం లేదా అని, నిమ్స్ లో పేద పిల్లల హాహాకారాలు వినిపించడం లేదా మండిపడ్డారు. పది రోజులుగా ఫుడ్ పాయిజన్ ఘటనలు నిత్యకృత్యమై పేదల పిల్లలు గోడుగోడునా ఏడుస్తుంటే కనీసం సమీక్ష అయినా నిర్వహించావా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించారు. విద్యాశాఖను అంటిపెట్టుకొని 11 నెలల్లో మీరు పీకిందేమిటని మండిపడ్డారు. ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులను అవస్థలకు గురిచేశారన్నారు. గురుకులాలకు తాళం పడేలా చేశారని, ప్రాథమిక పాఠశాలలకు శీతాకాలంలోనే ఒంటిపూట పెట్టారని దుయ్యబట్టారు. సకల జనులను కాంగ్రెస్ పార్టీ కన్నీళ్లుపెట్టిస్తున్నదని విమర్శించారు. మార్పుకు ఓటేసిన ఫలితం తెలంగాణను వెంటాడుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### పలికిమాలిన పాలనలో పల్లె, పట్టణ ప్రగతి లేదు : కేటీఆర్

కేసీఆర్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమంతో రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారిపోయాయి. తెలంగాణ తొలి పాలకుడి ఆశయాలను రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ పనికిమాలిన పాలనలో పల్లె ప్రగతి లేదు.. పట్టణ ప్రగతి లేదని విమర్శించారు. ముందుచూపు లేని ముఖ్యమంత్రితో రాష్ట్రానికే అతీగతీ లేదని దుయ్యబట్టారు. 'పల్లె ప్రగతి' వల్ల మొన్నటి దాకా మురిసిన పల్లెలు.. నేడు మురికి కూపాలను తలపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణ ప్రగతితో పరుగులు తీసిన పట్టణాలు, నేడు సమస్యలకు నిలయాలుగా మారుతున్నాయని ఫైరయ్యారు. ఒకప్పుడు పల్లె కన్నీరు పెడుతుంది అని పాడుకున్నాం.. ఇప్పుడు పట్టణాలు విలవిలలాడుతున్నాయని బాధపడే దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఈ మార్పు మాకొద్దు అనే నినాదం మొదలైందని, కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలించే రోజు దగ్గరపడిందని ఎక్స్ వేదికగా చెప్పారు.

## ఈనెల 14 నుంచి 17 వరకు అత్తాపూర్ రాంబాగ్ మైదానంలో సర్దార్ వల్లభాయ్ పటేల్
# కేసరి టైటిల్ రాష్ట్ర స్థాయి కుస్తీ పోటీలు


గత సంవత్సరం జరిగిన కుస్తీ పోటీలలో పాల్గొన్న మల్ల యోధులు


కుస్తీ పోటీలలో తలపడుతున్న మల్ల యోధులు


గత సంవత్సరం కేసరి టైటిల్ సాధించిన మల్లయోధుడితో నిర్వాహకులు గౌరిగే రాజు పహిల్వాన్


మహిళా మల్ల యోధులు

బుద్వేల్, నవంబరు 7 (ప్రభాత ఉదయం). : అత్తాపూర్ రాంబాగ్ మైదానంలో ఈనెల 14 నుంచి సర్దార్ వల్లభాయ్ పటేల్ కేసరి కుస్తీ పోటీలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రం నలుమూలల నుంచి ఈ కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి మల్ల యోధులు రానున్నారు. అందుకోసం నిర్వాహకులు గౌరిగె రాజు పహిల్వాన్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈనెల 14వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు కుస్తీ పోటీలలో పాల్గొనే మల్ల యోధుల బరువులను లెక్కించడం జరుగుతుందని నిర్వాహకులు రాజు పహిల్వాన్ తెలిపారు. పురుషుల కుస్తీ పోటీల్లో 57 కేజీల నుంచి అధిక బరువు ఉన్నవారికి అవకాశాలు ఉంటాయన్నారు. టైటిల్ మాత్రం 70 నుంచి 90 కేజీల బరువు ఉన్న కుస్తీ వీరుల కు నిర్వహించే పోటీలలో గెలుపొందిన వారికి అందజేయబడుతుందని తెలిపారు . బాలకేసరి విభాగంలో 50 కేజీల నుంచి ,60 కేజీల బరువు ఉన్న కుస్తీ వీరులకు జరిగే పోటీల్లో గెలుపొందిన వారికి టైటిల్ ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళ కేసరి పోటీల్లో 55 కేజీల నుంచి అరవై కేజీల సామర్థ్యం ఉన్న మహిళలు పోటీ పడే అవకాశాలు ఉన్నాయన్నారు . ఇతర వివరాలకు 9550441355 నెంబర్ కు కాల్ చేసి ఆధార్ కార్డు జిరాక్స్ , రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు ఇవ్వవలసి ఉంటుందన్నారు. కేసరి టైటిల్ గెలిచిన వారికి ప్రతి విభాగంలో మొదటి బహుమతిగా రూ. ఇరవై వేలు, ద్వితీయ బహుమతి గా రూ.10వేలు , తృతీయ బహుమతిగా రూ. 5 వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతే కాకుండా వారికి ట్రాక్ షూట్, షీల్డ్, మెడల్ , మెమొరాండం ఇస్తామన్నారు. పోటీలు ప్రతి రోజు సాయంత్రం వేళలో జరుగుతాయ న్నారు .

### మల్ల యుద్ధాన్ని ప్రోత్సహించడానికే ఈ పోటీలు : రాజు పహిల్వాన్

మల్ల యుద్ధాన్ని ప్రోత్సహించడానికి ప్రతి సంవత్సరం అత్తాపూర్ రాంబాగ్ లో కుస్తీ పోటీలను నిర్వహిస్తున్నాం. యువత చెడు మార్గంలో పయనించకుండా మల్ల యుద్ధంలో లాంటి వ్యాయమం చేసినట్లయితే ఆరోగ్యంతో పాటు ఆనంద జీవితాన్ని జీవించవచ్చని తెలిపారు. ఈ కుస్తీ పోటీలకు స్థానిక బీజేపీ నాయకులు అందిస్తున్న సహకారం మరిచిపోలేనిది.


వనభోజనంలో పాల్గొన్న బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్

# మన సంస్కృతి సాంప్రదాయాలు భావితరాలకు తెలియజేయాలి
## మేయర్ మద్దిల శ్రీలత ప్రేమ్ గౌడ్

బండ్లగూడ, నవంబర్ 7(ప్రభాత ఉదయం) మన సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు తెలియజేసే విధంగా ఉత్సవాలు నిర్వహించుకోవాల్సిన అవసరం ఉందని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మద్దెల శ్రీలత ప్రేమ్ గౌడ్ అన్నారు. గురువారం స్థానిక మహిళలు మృగవాని లో ఏర్పాటు చేసిన కార్తీకమాస వన భోజనం కార్యక్రమంలో మేయర్ లతా ప్రేమ్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ శ్రీలత మాట్లాడుతూ... ప్రజాహితమే లక్ష్యంగా తాను ముందుకు వెళుతున్నానని ప్రజలు ఏ అంశంపై సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.


పాండురంగ నగర్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సంగీత

# అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం: కార్పొరేటర్ సంగీత

రాజేంద్రనగర్, నవంబరు 7(నమస్తే ఉదయం) అభివృద్ధి లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ ఎం సంగీత గౌరీశంకర్ అన్నారు. గురువారం అత్తాపూర్ డివిజన్ పరిధిలోని పాండురంగ నగర్ లో సిసి రోడ్డు అభివృద్ధి పనులు ఆమె ప్రారంభించారు. పాండురంగ నగర్ చిన్న శివాలయం సమీపంలో అత్తాపూర్ కార్పొరేటర్ సంగీత గౌరీ శంకర్ బస్తీ ప్రజలతో కలిసి 20 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డు అభివృద్ధి పనులు అభివృద్ధి లక్ష్యంగా ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యదర్శి ఎం కొమరయ్య, లక్కన్ సింగ్ ,ఉమా భాయ్, ముఖేష్ బిరాదర్, విజయరావత్, రాహుల్, బాలకృష్ణ ,జిహెచ్ఎంసి వర్క్ ఇన్స్పెక్టర్ రవి బస్తీ ప్రజలు పాల్గొన్నారు.


ఉత్తర భారతీయుల చట్ పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# చాత్ పూజ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

బండ్లగూడ, నవంబర్ 7(ప్రభాత ఉదయం) ఉత్తర్ రాష్ట్ర ప్రాంతాలైన ఉత్తరప్రదేశ్, బీహార్, జారండ్ రాష్ట్ర ప్రజలు కార్తీక మాసంలో నిర్వహించే పూజా వేడుకల్లో బండ్లగూడ మున్సిపాలిటీ లోని గంధం గూడ , రాజేంద్రనగర్ పత్తి కుంట వద్ద జరిగిన చాట్ పూజలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ చాట్ పూజ విశిష్టతను వారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ... ఉత్తర రాష్ట్ర ప్రజలు చేసుకునే అతి పవిత్రమైన చాట్ పూజలో తాను పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. ప్రపంచానికి వెలుగు ప్రసాదించే ఆ సూర్యభగవానున్ని ప్రార్థించడమే చాట్ పూజ ప్రత్యేకత అని తెలిపారు. వారి వెంట స్థానిక నాయకులు ఉన్నారు.



గంగా దేవికి ఫలహారం అందజేస్తున్న మహిళలు


శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానానికి నిధులు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్


రోడ్డు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ నుండి జీవో పత్రాన్ని అందుకుంటున్న ఎమ్మెల్యే జిఎంఆర్

# శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి భక్తులకు శుభవార్త
### శ్రీ కురుమూర్తి కొండ పైకి వెళ్లడానికి 110 కోట్ల తో ఎలివేటెడ్ కారిడార్: ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, నవంబర్ 7(ప్రభాత ఉదయం) శ్రీ కురుమూర్తి స్వామి భక్తులకు ఎమ్మెల్యే జీఎంఆర్ శుభవార్త తెలియజేశారు. శ్రీ కురుమూర్తి దేవస్థానం అభివృద్ధి పట్ల దేవరకద్ర ఎమ్మెల్యే శ్రీ.జి మధుసూదన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చిన్నచింతకుంట మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ.శ్రీ.శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థాన గుట్టపైకి వెళ్లేందుకు ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ నిర్మాణానికి ప్రభుత్వం 110 కోట్ల నిధులను దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి మంజూరు చేయించారు. ఈ మేరకు రోడ్డు భవనాల శాఖ చీఫ్ సెక్రటరీ జీవో ను ఎమ్మెల్యే జిఎంఆర్ కు అందజేశారు. కురుమూర్తి దేవస్థానం వద్ద ఎలివేటేడ్ కారిడార్ తో కూడిన ఘాట్ రోడ్ మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కి ఈ సందర్భంగా ఎమ్మెల్యే జియంఆర్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణంతో కొత్త రూపు సంతరించుకొని కురుమూర్తి దేవస్థానం పర్యాటక కేంద్రంగా మారనున్నది. శర వేగంగా కురుమూర్తి దేవస్థాన పరిసరాలు అభివృద్ధి చెందనున్నాయి. కురుమూర్తి స్వామి దేవస్థానం వద్ద ఇటీవలే శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం 34 లక్షల రూపాయలతో మంజూరు చేయించి, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు కురుమూర్తి దేవస్థాన అభివృద్ధి కోసం, ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణానికి 110 కోట్ల రూపాయలు ఎమ్మెల్యే జియంఆర్ మంజూరు చేయించారు. ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రత్యేకత తీసుకొని కురుమూర్తి దేవస్థానం అభివృద్ధికి చేస్తున్న కృషి పట్ల నియోజకవర్గ ప్రజలు, స్వామి భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


కాలనీలో ఇంటింటికి సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పద్మావతి

# ఇంటింటి సర్వేకు ప్రజలు అధికారులకు సహకరించాలి: కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్

బండ్లగూడ, నవంబర్ 7(ప్రభాత ఉదయం) రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి కార్యక్రమం లో ఇంటికి వచ్చే సిబ్బందికి ఇంటి యజమానులు వివరాలు అందజేసి సహకరించాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ వార్డు కార్పొరేటర్ పద్మావతి పాపయ్య యాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న ఇంటింటికి సర్వే కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్ ,బిల్ కలెక్టర్ ఇమ్రాన్, కాలనీవాసులు కిషోర్ రెడ్డి,శ్రీనివాస్,లక్ష్మీనారాయణ ఎమ్యూనిరేటర్లు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# నర్కుడ మాజీ సర్పంచ్ వీరయ్యకు ఘనంగా నివాళులు

శంషాబాద్, నవంబర్ 7( ప్రభాత ఉదయం) శంషాబాద్ మండలంలోని నర్కుడ ఉమ్మడి గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ గూడెపు వీరయ్య ఐదవ వర్ధంతిని గురువారం నిర్వహించారు. నర్కుడ. చౌదర్ గూడ. కవ్వ గూడ గ్రామపంచాయతీలు నర్కూడ గ్రామంలో ఉన్న సమయంలో సర్పంచ్ గా విధులు నిర్వహించిన గూడెపు వీరయ్య ఐదవ వర్ధంతి సందర్భంగా రాజేంద్రనగర్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గూడెపు రాజేందర్ ఆధ్వర్యంలో వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు.

# వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా మహిళలకు సమాన అవకాశాలు కల్పించాలి


మేనేజ్‌లో జరిగిన వర్క్ షాప్‌లో పాల్గొన్న వివిధ దేశాల ప్రతినిధులు


వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న డాక్టర్ శరవణన్ రాజ్


వర్క్ షాప్‌లో మాట్లాడుతున్న ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ స్టాన్ ఫోర్డ్ బ్లేడ్

బుద్వేల్, నవంబరు 7(ప్రభాత ఉదయం) వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా మహిళా రైతులను, మహిళా వ్యవసాయ పారిశ్రామికవేత్తలకు, శాస్త్రవేత్తలకు సమాన అవకాశాలు ఉండేలా కార్యచరణతో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్ అన్నారు. రాజేంద్రనగర్ లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ మేనేజ్మెంట్ (మేనేజ్) లో జరిగిన వర్క్ షాప్ లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. మేనేజ్, ఇంటర్నేషనల్ రైస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ (ఇర్రి) , ఇక్రిశాట్ లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. జెండర్ ఇంపాక్ట్ ప్లాట్ ఫారంల సహకారంతో లింగ ప్రతిస్పందనాత్మక వ్యవసాయ విస్తరణ, పరివర్తన, పద్ధతులు, విధానాలు, సంస్థలు అనే అంశాలపై మూడు రోజులపాటు నిర్వహించే ఈ సదస్సులో 10 దేశాలకు చెందిన 30 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఆయా దేశాలకు చెందిన విధాన రూపకర్తలు, పరిశోధకులు, అభ్యాసకులు, అభివృద్ధి భాగస్వాములతో సహా కీలకమైన వాటా దారుల మధ్య డైనమిక్ సంభాషణ ద్వారా మహిళా రైతులకు సాధికారత కల్పించడానికి వ్యవసాయ విస్తరణ సలహా సేవలు పంపిణీలో విప్లవాత్మక మార్పులు చేయడం ఈ వర్క్ షాప్ లక్ష్మన్నారు. ప్రారంభ ఉపన్యాసంలో ఇక్రిశాట్ తాత్కాలిక డైరెక్టర్ జనరల్ డాక్టర్ స్టాన్ఫోర్డ్ బ్లేడ్ మాట్లాడుతూ, భవిష్యత్తులో వ్యవసాయ రంగంలో మహిళా రైతులకు, వ్యవసాయ మహిళా పారిశ్రామిక వేతలకు క్రియాశీలకంగా మద్దతునిచ్చి ప్రోత్సహించే విధానాలు, పద్ధతులు తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. మేనేజ్ ఇంచ ర్జీ డైరెక్టర్ జనరల్, అడ్మినిస్ట్రేషన్ అగ్రికల్చరల్ ఎక్స్ టెన్షన్ డైరెక్టర్ డాక్టర్ శరవణన్ రాజ్ మాట్లాడుతూ, వ్యవసాయ విస్తరణ సంస్థల ద్వారా స్థానికంగా ఉండే నిపుణులను శక్తివంతం చేయాలని ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. వ్యవసాయ పరిజ్ఞానాన్ని అన్ని సంస్థలలో పనిచేసే మహిళా రైతులకు, శాస్త్రవేత్తలకు అందించడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇర్రీ కి చెందిన డాక్టర్ రంజిత పుష్కర్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగంలో పురుషులతో సమానంగా మహిళలను ప్రోత్సహించాలని అన్నారు. కార్యక్రమంలో మేనేజ్ కు చెందిన డాక్టర్ వినీత కుమారి తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలి: సీఐటీయూ డిమాండ్



గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) నవంబర్ నుంచి మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఏ. వెంకటస్వామి డిమాండ్ చేశారు. గురువారం గద్వాల్ టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సీఐటీయూ (అనుబంధం )జనరల్ బాడి సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దశాబ్దాల నుండి మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ పేరుతో కార్మికులు విధులను నిర్వహిస్తున్నారని కానీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వీరికి ఏటువంటి ఉద్యోగ భద్రత కల్పించడం లేదని విమర్శించారు. ఆధునిక కాలంలో కూడా తమ చేతులతో పారిశుధ్య పనులను నిర్వహిస్తున్న కార్మిక వర్గాన్ని శ్రమ దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అత్యున్నత న్యాయస్థానాలు సైతం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని చెప్పినప్పటికీ పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించడం లేదని, చెల్లించే వేతనాలను సైతం రెగ్యులర్ గా ఇవ్వకుండా నెలల తరబడి పెండింగ్లో పెడుతున్నారని విమర్శించారు. పిఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు కల్పించకుండా కార్మికులతో వెట్టి చేయిస్తున్నరని విమర్శించారు మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు రక్షణ పరికరాలు, సబ్బులు నూనెలు వంటివి సక్రమంగా అందజేయకుండా వారి ఆరోగ్యాన్ని, ప్రాణాలను సైతం పణంగా పెట్టి పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని, అటువంటి కార్మికుల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్య ధోరణి సరికాదని విమర్శించారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా ఉండి పోరాడాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీలలో కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికులు పదవి విరమణ పొందిన తరువాత వారి వారసులను విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు తీసుకొస్తున్న విధానాలను కార్మిక వర్గం అర్థం చేసుకొని సంఘటితంగా పోరాడి సమస్యల పరిష్కరించుకోవాలని అన్నారు. అనంతరం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా శివ,డి.రవి, కోశాధికారిగా మహేష్ ,ఉపాధ్యక్షులుగా దౌలమ్మ, రఘు, సహాయ కార్యదర్శిగా కే. రాజు ,టి. హనుమంతు, సభ్యులుగా పాండు,హరి శంకర్, వెంకటేష్, లలితా, లక్ష్మీ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉప్పేర్ నరసింహ, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఘట్టన్న, కార్మికులు పాల్గొన్నారు.



అధికారులతో సమావేశమైన కలెక్టర్ సంతోష్

## బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలను అరికట్టేందుకు అధికారులు బాధ్యతగా పనిచేయాలి: కలెక్టర్ సంతోష్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) జిల్లాలో బాల కార్మిక వ్యవస్థను, బాల్య వివాహాలను, అరికట్టేందుకు అధికారులందరూ సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ అన్నారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల సంరక్షణ కోసం జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని గట్టు, కేటిదొడ్డి, మల్దకల్ మండలాల్లో అధికారులు ప్రత్యేక దృష్టి సారించి బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అందుకు గాను గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి డ్రాప్ అవుట్ అయిన పిల్లలు తిరిగి పాఠశాలల్లో చేరే విధంగా కృషి చేయాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు పోలీసు శాఖ కూడా పూర్తి సహకారం అందించాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు బడి మానేసిన 945 పిల్లలను గుర్తించి, వారికి కౌన్సిలింగ్ నిర్వహించి 800 మందిని తిరిగి పాఠశాలల్లో చేర్పించినట్లు తెలియజేశారు. రెస్క్యూ చేసిన బాల కార్మికులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పాఠశాలల్లో వెంటనే చేర్చుకోవాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. అనంతరం అధికారులతో కలిసి ప్రతిక్షణం అప్రమత్తం - సురక్షితం అనే కరపత్రాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ నర్సింగరావు, జెడ్పి సీఈఓ కాంతమ్మ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సుధారాణి, లేబర్ ఆఫీసర్ మహేష్ కుమార్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ప్రియాంక, బిసి ఎస్సి సంక్షేమ శాఖల అధికారులు రమేష్ బాబు, సరోజ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు జయ భారతి, చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ రవి, సిడిపిఓలు వైద్య, పోలీసు వివిధ శాఖల సహాయ అధికారులు పాల్గొన్నారు.



## నియోజకవర్గ రహదారుల అభివృద్ధికి కృషి చేస్తా: ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర, నవంబర్ 7(ప్రభాత ఉదయం) నియోజకవర్గంలో రోడ్లను అభివృద్ధి చేసి ప్రజలకు రవాణా సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించేందుకు కృషి చేస్తానని దేవరకద్ర నియోజకవర్గం శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గం అడ్డాకుల మండలం వర్నే గ్రామం వద్ద హై లెవెల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై బ్రిడ్జ్ ను దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ... గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం కోసం రైతుల వద్ద భూమిని తీసుకుని, వారికి ప్రత్యామ్నాయ భూమిని కేటాయించకపోవడం, రైతులు కోర్టుకు వెళ్లడంతో బ్రిడ్జి పనులు నిలిచిపోయిన విషయం తమ ప్రభుత్వం దృష్టిలో ఉంచుకొని...సంబంధిత రైతులతో తమ ప్రభుత్వం సామరస్యంగా మాట్లాడి, రైతులకు ప్రత్యామ్నాయంగా భూమిని కేటాయించి, కురుమూర్తి బ్రహ్మోత్సవాల లోపు భక్తులకు బ్రిడ్జ్ ను అందుబాటులో తీసుకురావాలన్న లక్ష్యంతో యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేయించి, బ్రిడ్జ్ ను ప్రజలకు అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు.

## రోడ్డుపక్కన కారు ఆపి.. భోజనం చేసొచ్చే గ్యాప్‌లోనే.. నగదు చోరీ

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం)ఆకలేస్తుందని కారును రోడ్డు పక్కన ఆపేసి భోజనం చేసేందుకు వెళ్తే.. తిరిగి వచ్చేసరికి డబ్బుల బ్యాగ్ కనిపించలేదు. ఈ ఘటన గురువారం జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో పట్టపగలే చోటు చేసుకుంది. భోజనం చేసొచ్చే గ్యాప్‌లోనే.. ఏకంగా 3.60 లక్షల నగదుతో ఉన్న బ్యాగ్‌ను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. అయితే.. ఈ విషయాన్ని గద్వాల టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వెంటనే స్పందించి.. సీసీ కెమెరా దృశ్యాల ద్వారా దుండగులు వెతికే పనిలో పడ్డారు. వివరాలోకి వెళ్లితే... అలంపూర్ మండలం ఇమాంపురం గ్రామానికి చెందిన జితేందర్ అనే వ్యక్తి వ్యక్తిగత పని మీద గురువారం గద్వాలకు వచ్చాడు. భోజనం చేయడం కోసమని.... జిల్లా కలెక్టరేట్ ముందున్న ఓ హోటల్ పక్కన కారును పార్క్ చేశారు. కారులో రూ.3.60లక్షలు నగదును ఉంచి భోజనం చేశాడు. భోజన అనంతరం కారు వద్దకు వెళ్లి చూసేసరికి నగదు బ్యాగ్ కనిపించలేదు. నగదు అపహరణకు గురైనట్లు బాధితుడి గ్రహించి గద్వాల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

చెరువులో చేప పిల్లలను పదులుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



## మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్, నవంబర్ 7(ప్రభాత ఉదయం) మత్స్యకారుల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. గురువారం నందిగామ మండలం నర్సప్ప గూడ గ్రామంలో అక్కమ్మ చెరువులో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, డిస్టిక్ ఫిషరీస్ ఆఫీసర్ పూర్ణిమలతో కలిసి ఉచిత చేప పిల్లలను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్ వదిలారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలని లక్ష్యంతో 100% రాయితీ పై చేప పిల్లల పంపిణీ చేస్తుందని. అలాగే మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లవేళలా సహాయ సహకారాలు అందజేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కావాలి కృష్ణ, నేతలు మాజీ ఎంపీపీ శివ శంకర్ గౌడ్,జంగా నరసింహులు, కుమారస్వామి గౌడ్, కొమ్ము కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

## భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న మహాసంకల్ప కోటిలింగాల ప్రతిష్ట కార్యక్రమాలు

### కార్తీకమాసంలో జన్మ తరింప చేసే కోటిలింగాల ప్రతిష్ట పూజలు

కొత్తకోట, నవంబర్7(ప్రభాత ఉదయం) కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజి దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం లో శ్రీకోటిలింగేశ్వరదత్తదేవస్థానములో భక్తులు కార్తీక మాస మహోత్సవ ఉత్సవాలు భక్తశబ్దలతో జరుపుకుంటున్నారు. దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కార్తీకమాసం పురస్కరించుకొని బుధవారం ఆరవరోజు కోటిలింగాల ప్రతిష్ట కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. భక్తులు తమస్వహస్తాలతో పదకొండువేలశివలింగాలు ప్రతిష్టించే అపూర్వ కార్యక్రమం దేవస్థానము వారిచే ఏర్పాటు చేయగా ఆదోని వీర శైవ అగమ పాఠశాల అధ్యాపకులు,అర్చకులు జగదీశ్వర స్వామి శిష్య బృందం ఆధ్వర్యంలో జరుపగా భక్తులు అధిక సంఖ్యలో దేవాలయానికి చేరుకొని భక్తిశ్రద్ధలతో కోటిలింగాల ప్రతిష్టలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు జగదీష్ స్వామి, అనిల్ స్వామి,ఆలయ ధర్మకర్త రుమాళ్ళ మహేశ్వర్ భక్తులచే మొదట భక్తులచే రుద్రహోమం చేయించి పూర్ణాహుతి సమర్పించి కూష్మాండ బలి మహామంగళహారతి సమర్పించి అనంతరం పదకొండు వేల శివలింగాలు కలిగిన శివకోటి యంత్రాలకు రుద్రపఠనంతో భక్తిశ్రద్ధలతో అభిషేకం చేయించి భక్తుల స్వహస్తాలతో పదకొండు వేల శివలింగాలు ప్రతిష్ట చేయించారు. అనంతరం ప్రతిష్టలో పాల్గొన్న భక్తులందరికి ఆలయకమిటి వారు అన్న ప్రసాద వితరణ చేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి రుమాళ్ళ శేఖర్, కమిటీ సభ్యులు విశ్వనాథ్, జగదీశ్వర్,రాజేష్ వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రేమ పెళ్లి కేసులో యువకుడు పోలీస్ స్టేషన్ ముందు ధర్నా

### ఊర్లోకి రానివడం లేదంటూ...

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం)ప్రేమించి పెళ్లి చేసుకున్న పాపానికి గ్రామానికి చెందిన కొందరు సొంత ఊర్లోకి రానివ్వడం లేదని, తన భార్యను తన నుంచి దూరం చేసిన ధరూర్ పోలీసులపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన ఓ యువకుడు ఆరోపణలు చేస్తూ...గురువారం ధరూర్ పోలీస్ స్టేషన్ ముందు ధర్నాకు చేస్తున్న ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. వివరాలకు వెళ్లితే.... ధరూర్ మండలం జాంపల్లి గ్రామానికి చెందిన వీరేష్ అనే వ్యక్తి కొన్ని నెలల క్రితం అదే గ్రామానికి చెందిన శృతి అనే అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అమ్మాయి తరపు తల్లిదండ్రులు ధరూర్ పోలీస్ స్టేషన్ లో మిస్సింగ్ కేసు పెట్టడంతో ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షకూర్ విచారణ పేరుతో అమ్మాయిని తన నుంచి దూరం చేసారంటూ బాదితుడు వీరేష్ పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రేమ పెళ్లి చేసుకునందుకు తనను ఊర్లోకి రానివకుండా బెదిరిస్తుండటంతో భయంతో గద్వాలలో తల దాచుకున్నట్లు బాధితుడు వెల్లడించారు. దీపావళి పండుగ రోజు అమ్మాయి కుటుంబ సభ్యులు తమ కుటుంబ సభ్యులపై దాడి చేశారని,ధరూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసిన పోలీసులు న్యాయం చేస్తలేరంటూ... బాధితుడు తమ ఆవేధనను సోషల్ మీడియా ద్వారా వెల్లిబుచ్చారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న తన భార్యను తన నుంచి దూరం చేయడమే కాకుండా ఊర్లోకి రానివ్వకుండా చంపుతామని కొందరు బెదిరిస్తున్నారని, దీనిపై పోలీసుల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేదని అమ్మాయి కుటుంబ సభ్యులను పలుమార్లు దాడి చేయడంతో పోలీసులను ఆశ్రయించిన పోలీసులు వారికే వత్తాసు పలుకుతున్నారని బాధితుడు ఆరోపించారు. తనకు న్యాయం జరిగేంత వరకు ధరూర్ పోలీస్ స్టేషన్ ముందే కూర్చుంటానని బాధితుడు తెలిపారు. దీనిపై ధరూర్ ఎస్ఐ అబ్దుల్ షకూర్ ను వివరణ కోరగా.... అమ్మాయి తప్పిపోయిందంటూ తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయగా... అమ్మాయిని ట్రేస్ చేసి పట్టుకోవడం జరిగిందని, ఆ సమయంలో వీరేష్ పరారు అయ్యాడని, అమ్మాయిని తల్లి దండ్రులకు అప్పగించడం జరిగిందన్నారు. వీరేష్ కుటుంబ సభ్యులపై దాడి చేసినట్లు తమకు ఫిర్యాదు అందిందని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

### మహిళ మృతిపై అనుమానాలు వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు



మెరిస్సా (ఫైల్ ఫోటో)




గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 7(ప్రభాత ఉదయం)గద్వాల పట్టణ పరిధిలో గల ఔటర్ రింగ్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందింది. తన భర్తతో కలిసి బైక్‌పై వెళ్లుతుండగా కుక్క అడ్డు రావడంతో సడన్ బ్రేక్ వేయడంతో వెనుకాల కూర్చున మహిళ కిందపడి అక్కడికక్కడే మృతి చెందిందని మృతురాలి భర్త రామకృష్ణ పేర్కొన్నాడు. కుటుంబ సభ్యుల తెలిపిన వివరాల ప్రకారం. గద్వాల మండలం గోనుపాడు గ్రామానికి చెందిన మెరిస్సా(35) పరమాల స్టేజ్ సమీపంలో ఉన్న బీసీ వెల్ఫేర్ హాస్టల్‌లో రోజు కూలీ పని పనిచేస్తుంది. ఈ క్రమంలో రోజువారీగా గోనుపాడు నుంచి హాస్టల్‌కు బైక్‌పై కొడుకుతో కలిసి భర్త రామకృష్ణ బయలుదేరారు. గద్వాల నుంచి ఔటర్ రింగ్ రోడ్డు మార్గం గుండా వెళుతుండగా కుక్క అడ్డం వచ్చి సడన్‌గా బ్రేక్ వేయడంతో వెనుక ఉన్న మెరిస్సా (35) కిందపడి అక్కడిక్కడే మృతి చెందింది. కానీ రోడ్డు ప్రమాదలో మహిళ మృతిపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తమ కూతురిని భర్తనే చంపాడని మృతురాలి తల్లి, తమ్ముడు ఆరోపించారు. బైక్‌పై ముందర కూర్చున్న కుమారుడు, వాహనం నడుపుతున్న రామకృష్ణకు ఎలాంటి గాయాలు కాల్దేని, కేవలం మా కూతురు కిందపడి ఎలా మరణిస్తుందని ప్రశ్నిస్తున్నారు. మృతురాలిని భర్త నిత్యం మానసికంగా వేధిస్తుండేవాడని, భర్తనే హత్య చేసి, రోడ్డు ప్రమాదం చిత్రీకరించాడని మృతురాలి తమ్ముడు ఆరోపించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గద్వాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మృతురాలి భర్త తప్పించుకొని తిరుగుతున్నాడని, ప్రమాద సమయంలో బైక్ పైన ఉన్న కుమారుని సైతం ఎక్కడో దాచి పెట్టారని, పోలీసులు ఆ బాబుని విచారిస్తే అసలు విషయం బయట పడుతుందన్నారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యునిపై కఠిన చర్యలు తీసుకోవాలని మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులు బంధువులు కోరుతున్నారు. మృతురాలికి ఇద్దరు కుమారులు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనునట్లు గద్వాల పట్టణ ఎస్సై కళ్యాణ్ రావ్ తెలిపారు.



మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కలిసిన తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షులు గణపత్ రెడ్డి, కమిటీ ప్రతినిధులు

## రైస్ మిల్లర్ల సమస్యల పరిష్కారం కోసం మాజీ ఎమ్మెల్యే మైనంపల్లిని కలిసిన అసోసియేషన్

మల్కాజిగిరి, నవంబర్ 7(ప్రభాత ఉదయం) తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్లర్ల సమస్యలు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తో వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ అధ్యక్షులు గణపతి రెడ్డి సూచనలు సలహాలు తీసుకున్నారు.తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీరేశం, తెలంగాణ రాష్ట్ర రైస్ మిల్ అసోసియేషన్ కోశాధికారి విశ్వనాథ వెంకటరమణ వీరేశం తదితరులు పాల్గొన్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.